# జాజిపూల వాన

వర్షం... వర్షం... భూదేవిని కౌగలించుకుందామని తపించిపోయిన సుందర వర్షం! పరుగు పరుగునా చినుకు చినుకునా ఒకటే సౌందర్యం! ఆ జల్లుల విరుపులు, ఈ చినుకుల వలపుల తలపులు, గుండెల్లో ఎడతెగని తీయని ఒరుపులు.....

గొడుగు పుచ్చుకొని తడవకుండా ఆ కర్రకు చుట్టుకొనిపోవడానికి ఏదో ప్రయత్నం... చుట్టూ ఎటు చూసినా వర్షం... గొడుగు తలపై వర్షం... ఈ కాళ్ళపై వర్షం.... ఒకసారి ప్రగాఢంగా చుంబించే జల్లుల పెదవుల తాకిడి.. సన్నసన్నని తుంపరుల కనివిని ఎరుగని ఎలజవరాలి నును లేబుగ్గల తులతూగు స్పర్శ !

ఆ ప్రక్క గాంధీ గారి పేరుతో వెలసిన పురం.... ఈ మూల ప్రకాశం గారి కీర్తిగా నిలచిన నగరం... ఎట్ట ఎదుట ఒకానొక శక్తి దానవాయి పేరిట కట్టబడ్డపేట... మధ్యలో వీరేశలింగం గారితోట! ఆ వర్షంలో ఆ జల్లుల పరీరంభంలో పులకింతలుగా సాగిపోతున్న ఊహలు... ఆ ఊహలు అల్లిబిల్లిగ అల్లుకొన్న వర్షపు లేసులు... వాటి నుండి వెలువడే వాన చూపులు...!

చిత్రం! ఆ వాన వానంతా చిక్కని చెట్లుగా మొలచినట్లున్న ఆచెట్లు, ఆ వాన వానంతా పల్చని ఇళ్లుగా నిలిచినట్లున్న ఆ ఇళ్ళు... ఆ నీటి చూపులతో తల ఎత్తిన ఆ నీటిలోకపు తీరు తెన్నులు!

ఆకళ్యాణ మంటంపం కప్పు క్రింద... కదిలే కటకటాలుగా నిలచిన ఆ వాన బోనులో... హోరున కురుస్తూన్న ఆ వాన నంతటినీ తన గుప్పిట ఉంచుకొని చిత్రకారుడు మోహనంగా మలచిన వాన సుందరి!

ఆ ముంగురులు...

ఆ నీటి తుంపరులు

సనసన్నని ఆ నీటి ధారలు

సనసన్నని భుజాలు

నల్లని మేఘాలు

సుందర నయనాలు....

కొనసాగిన మెరుపులా మెరిసిపోయే ఆ అవయవాలు!

కాళ్ళు ముందుకడుగు వేయడానికి మొరాయించాయి! చూపులు అటే అటే చూడాలని మురిసిపోతున్నాయి!

మనసులో వర్షం కురుస్తోంది. చల్లదనం దోబూచులాడుతోంది! ఆ అమ్మాయి ఆ కళ్యాణ మంటపం మీద కదలక మెదలక నిలబడిపోయి ఉంది!

అక్కడి కామె వచ్చేటప్పటికి వర్షం జోరు హెచ్చి ఉంటుంది. ఎక్కడికి వెళ్ళాలో పాపం! ఇంతలో వర్షం తగ్గే సూచన లేదు. ఒక చేతిలో పుస్తకాలున్నాయి. ఒక చేతిలో మందు సీసా ఉంది. పాపం ఆమె బిత్తర చూపులు చూస్తోంది.

ఆమెకు సహాయపడాలని అతని మనస్సు రివ్వు రివ్వున గాలివానలా ఊగిసలాడింది. సుళ్ళు తిరిగింది, చుట్టూ ఎటుచూసినా రిక్షాలు కనిపించని స్థలం అది. అందులో ఇలాంటి వానలో అవి అపురూపం! ఎలా పాపం? ఎలాగో ఓలాగ ఆమెను వాళ్ళ ఇంటికి చేర్చితే... గుండె తేలిక పడుతుంది. వర్షం వెలిసినట్లుంటుంది. కాని ఆ వర్షం ఇప్పుడిప్పుడే వెలిసేట్లు లేదు.

అతని కళ్ళు అటు తిరిగి చూశాయి. అప్పుడే ఆమె అతనివైపు చూసింది. చల్లని నీటి తెర, అతని ముఖాన్ని కొంటెగా చుంబించింది. ఎంత మాయగా ఉంది ఆ చూపు... ఆ చూపులో అదేదో పిలుపు... వెంటనే సన్నని ధ్వని...

'ఏమండీ...'

భ్రమ కాదుకదా

వర్షం హోరు అయిఉంటుంది...

కాదు కాదు

ఆ పెదవి చలించింది

ఆ కదలికలో

ఆకన్నులలో

ఆ 'పిలుపు'

ముడిపడింది!

కాళ్ళు ఆగిపోయాయి. ఆగినట్లే ఆగి అటే కదిలాయి. వర్షం మరింత విజృంభించింది.

మడత పెట్టినపేంటు తడిసిపోయింది. కాళ్ళ క్రింద నీళ్ళు జలజల మంటూ పరుగెడుతున్నాయి. పచ్చని శాద్వల తలవంచుతోంది. పెళ్ళి కూతురులా ఆనందంతో ముసి ముసి నవ్వులు పోతోంది. ఆమె ఎట్టఎదుట అతని కాళ్ళు ఆగిపోయాయి!

అతని కళ్ళముందు ఆ సౌందర్యం రూపు కట్టింది! అతని మనసులోని పెదవి సడీ చప్పుడు చేయకుండా కదిలింది.

అప్పుడే ఆమె మాటలాడింది!

చెవులు వింటున్నాయి. కళ్ళు మెరుస్తున్నాయి. వర్షపు హోరును చీల్చుకొని వస్తూన్న ఆ మాటలతీరు మనోహరంగా ఉంది.

"క్షమించండి... ఇంటి దగ్గర ఎవ్వరూ లేరు. తాతయ్యకు జబ్బుగా ఉంది. బజారుకు పోయి మందు తేవలసి వచ్చింది. మందు కొన్నాను. దారిలో స్నేహితురాలు కనిపించింది. పుస్తకం ఇస్తాను రమ్మంది. ఈ గాంధీపురం వచ్చాను. పుస్తకం తీసుకొన్నాను. గబాగబా బయలు దేరాను. ఇక్కడ కొచ్చేటప్పటికి ఈ వానతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఇంటికి వెళ్ళితేనే గాని ఈ మనసుకు శాంతి ఉండదు. ఈ మందు త్వరగా తీసికొని పోవాలి" ఆమె ఆగిపోయింది. తరువాత ఏమి చెప్పాలో బహుశా ఆమెకు తోచి ఉండదు.

నిజానికతనికి మాత్రం ఏమి తోచింది. పాపం ఏమీ తోచలేదు. ఈ లోగా అతని శరీరం అతన్ని పూర్తిగా మరిచిపోయింది. అతని మనసు అతనికి చెప్పకుండానే ఎటో కదలిపోవాలనుకుంది. కాని అతను అక్కడే నిలిచి ఉన్నాడు! నిండుగా వర్షం కురుస్తోంది. అతను క్షణం విలంబన చేయకుండా ఆమె ఊహకు రూపంగా, 'ఇదిగోండి..... గొడుగు... మీరు త్వరగా వెళ్ళండి. నేనిక్కడ ఈ వర్షం వెలిసేవరకు ఉండివస్తాను. మీ ఇంటి అడ్రసు చెప్పండి'.

ఈ మాటలతో ఆమె గజిబిజిపడిపోయింది. ఈ విధంగా అతను అంటాడని ఆశించినట్లు లేదు.

'వద్దండీ... వద్దు....' అంది.

అతని మనసు తికమక పడింది 'అయితే ఎందుకు పిలిచినట్లు?' అడగాలనుకుంటూనే అడగలేక పోయాడు.

'ఫరవాలేదు. తీసుకోండి...'

ఆమె కాస్సేపు మాట్లాడలేదు. ఏమో ఆలోచిస్తూన్నట్లు రెప్పలల్లార్చింది. వర్షం విస్తృతంగా కురుస్తోంది. సౌందర్యం ఎడతెగకుండా ఊహిస్తోంది.

'నేను మిమ్మల్ని పిలిచినపుడు ఈ భావంతో పిలవలేదండీ... మీ గొడుగులో కాస్త చోటు అడగాలనే పిలిచాను'.

ఒక్కసారి గుండె ఝల్లుమంది. వర్షం చినుకు చినుకునా పులకించి పోయింది.!

'మీకు లోకం సంగతి తెలియదండి... ఈ విషయంలో మనకు పట్టింపులు లేకపోవచ్చు. కాని ఈ లోకానికి కావలసినంత పట్టింపు. ఈ పట్టింపులలో, అది ఎంత దూరమైనా వెళ్తుంది.' అతని తల ఖరాబై పోయింది. తనను తానే తిట్టుకుంటూన్నట్లు వర్షం చీలిపోతోంది!

'ఈమాత్రపు దానికి అలా పిచ్చిపోకడలు పోయే లోకాన్ని నేను ఈసడిస్తానండీ....' ధైర్యంగా నిబ్బరంగా కురుస్తోంది వర్షం.

'అతను క్షణం ఆలస్యం చేయకుండా, అయితే తీసుకోండి ఈ గొడుగు....'

'థేంక్సండీ.....'

'మీ అడ్రసు చెప్పండి మరి.'

'సారీ... మరిచిపోయాను. పార్కు దగ్గర అడ్వొకేటు సూర్యనారాయణ మూర్తి గారిల్లండి'

' ఏమిటీ.. సూర్యనారాయణ మూర్తిగారి మనవరాలా మీరు... ఆనర్స్ చదువుతున్నారు కదూ....'

'ఔనండీ... మీ కెలా తెలుసు?'

'వర్షం వెలిసిన వెంటనే మీ ఇంటికొచ్చి చెప్తాగా... త్వరగా వెళ్ళండి'

'దయచేసి మీ పేరు చెప్తారా'

'వస్తాను కదాండి మీ ఇంటికి'

'ఇదిగో... గొడుగు మీదే వ్రాసుకున్నారే... 'జాజి' అని ఉన్నదేమిటి? మీ శ్రీమతి గారా...'

'చంపేశారు. నాకింకా ఆ అదృష్టం పట్టలేదు. అది నా పెన్ నేమ్ ..... మా చెల్లెలు వద్దు మొర్రో అంటే వినకుండా గొడుగుపైకి ఎక్కించింది.

'బాగుంది. 'జాజి' తమరా... అయితే ఏమండీ... మీరింత చిన్నవాళ్ళు కదా... అంత వేదాంతం రాస్తారేం ... మగాళ్ళై ఉండి ఆడ పిల్ల పేరు పెట్టుకున్నారేం...?'

ఆమె నవ్వింది. అతనూ నవ్వకుండా ఉండలేక పోయాడు. నవ్వి, మీరు ఆడపిల్లై ఉండి మగాళ్ళ గొడుగుల్లో నడుస్తానన్నారేం...

'అవసరమండీ...'

'అలాగే అలాగే ఆపేరు మొదట్లో నాకథ అచ్చయ్యేందుకు అవసరమయిందండీ....'

'ఆమె పకపక నవ్వింది. చుట్టూ వర్షం ఆమెను చుట్టేసింది. వెధవ గొడుగులు తల తడవకుండా ఉండేందుకు తప్ప ఎందుకూ పనికిరావు.

ఆమె కదలిపోయింది. ఆమెతోనే వర్షం నడిచింది. దేవతా స్త్రీ వెనుక చీర చెరగులా వెళ్ళింది.

అలాగే నిలుచుండిపోయాడు జాజి !

ఎక్కడా వర్షం వెలిసే సూచన కనిపించడంలేదు. తనకుమాలిన ధర్మం చేశానేమో అనుకున్నాడు. 'ఎవరికైనా అంతటి ఆత్మ స్థైర్యం ఉండాలి. అలాంటి మనో నిబ్బరం నిజంగా హర్షించ తగ్గది. కాని తను రచయిత అయి ఉండీ ఆమెలోని ధైర్యాన్ని నిరసించాడు. లోకానికి తల ఒగ్గమన్నాడు. ఇందుకనే ధైర్యంలేనివాళ్ళు రచయితలుగా ఉండగూడదు.

అతను తనమనసులో ఎంతగానో బాధపడిపోయాడు. ఆమె వెళ్ళిన దారి వెంట అతని కళ్ళు ఏమిటో వెదకుతూ నిరాశగా అతని గుండెలో వేదనలు నింపుతున్నాయి.

పాపం జాజి మెత్తనివాడు. చిన్న విషయానికైనా భయపడతాడు. మనసులో మధనపడతాడు. ఒక రోజున అతను మెల్లగా ఓ బాటకు పక్కగా తనలో తానుగా నడుస్తున్నాడు. కొంతసేపటికి అతను తన వూహలలోంచి బయట పడి, మెల్లగా పక్కకు తలత్రిప్పి చూసేసరికి ఓ అమ్మాయి అతని పక్కనే నడుస్తోంది. ఒక్కసారిగా అతనికి మతి పోయింది. సహజంగా మామూలుగా నడుస్తున్నవాడు, గబగబా అడుగులు వేసి, ఆమెకన్న ముందు నడచి ఆమెకు దూరంగా తొలగిపోవాలనుకున్నాడు. కాని అతనికి వేగంగా నడవడం ఎప్పుడూ అలవాటు లేదు. అలవాటు లేనిపనిఎబ్బెట్టుగా ఉంటుంది. అంచాత అతను ఆమెకన్న మరింత మెల్లిగా నడచి ఆమెకు వెనుకపడ్డాడు. తృప్తిగా గాలి పీల్చాడు. హమ్మయ్య అనుకున్నాడు. కాని కొంతదూరం వెళ్ళిన తరువాత ఆమె ఎందుకనో అతనివేపు వెనుదిరిగి చూసింది. ఆరాత్రి అతనికి నిద్ర పట్టలేదు. అప్పటినుంచీ అతనికి రోడ్డుమీద నడవడమంటే వల్లమాలిన భయం!

ఓ రోజున స్నేహితుని ఇంటికి వెళ్ళాడు. ఆ స్నేహితుడు ఇంటివద్ద లేదు. వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోవడానికి ప్రయత్నించాడు. స్నేహితుని భార్య పిలచింది. ఫలహారాలేగ చేసి వెళ్ళమంది . "వద్దండీ" అన్నాడు. "ఫలహారం వద్దనేవాళ్ళు

మీరొక్కరే కనిపించారు. రండి...రండి." అంటూ లోనికి వెళ్ళిపోయింది. అక్కడ నుంచి ఎలా వెళ్ళిపోవాలో అతనికి అగమ్యమైపోయింది. ఇంతలో ఆమె ఫలహారం తేనేతెచ్చింది. తలవంచుకొని తినడం మొదలుపెట్టాడు. ఇంతలో ఆమె తిరిగి వడ్డించ బోయింది. సన్నగా నవ్వింది. 'వద్దండీ...వద్దు....' చేతులు అడ్డం పెట్టాడు. ఆమె - అతని ఆ చేయి గబాలున పుచ్చుకొని, 'తినకపోతే నామీద ఒట్టు' అంది. జాజి పాపం కొయ్యబారిపోయాడు. ఈ దృశ్యాన్ని అతను ఎప్పుడూ తలచనైనా తలచలేడు. తలిస్తే అతని శరీరమంతా జ్వరం వచ్చినట్లయిపోతుంది. ఆమె అంత ఆప్యాయంగా తన చేతినవతలకు త్రోసి వడ్డిస్తే, తను ఇలా గజ గజలాడిపోవడమేమిటి? తనలో ఏదో లోపముంది. అదేమిటో తనకు తెలియకుండా ఉంది..... అని ఎంతగానో వూహించేవాడు. పాపం అతను ఆనాటినుంచీ ఆ స్నేహితుని ఇంటికి అంతగా వెళ్ళడం మానేశాడు.

ఎడతెరిపి లేకుండా కురుస్తూన్న వర్షంలో జాజికివన్నీ గుర్తుకొచ్చాయి. చీకటి పడిపోతోంది. వర్షం వెలిసే సూచన కనిపించడం లేదు. రాను రాను చలిగాలి భయంకరంగా వీచడం మొదలు పెట్టింది. చెట్లు వికృతంగా రోదిస్తున్నాయి. ఎక్కడ ఏమి లోపం వచ్చిందోకాని విద్యుద్దీపాలు వెలగడం మానేశాయి. దూరంగా చుట్టూ ఉన్న మేడలూ , చెట్లు అన్నీ అన్నీ ఆ చీకటిలో కలసిపోయాయి. అతను ఇంతకుముందు ఏమిచూశాడో అవేవీ అక్కడ లేనే లేనట్లు చీకటి వికృతంగా నవ్వింది. వర్షం కనిపించకుండా కురుస్తోంది. మెరుపు మెరిసినప్పుడల్లా సమస్తము దృగ్గోచరమవుతోంది. విశ్వవిరాట్ స్వరూపం కనులముందు అవతరించి, మరోక్షణంలోమాయమైపోయినట్లు, ఒక్కసారి అంతా కనిపించి తిరిగి ఇంతలోనే ఏమీ లేనట్లుంటోంది. జాజి మనోక్షేత్రాన అంతా ఒక్కసారి జ్వలించి తిరిగి ఏమీలేనట్లు అంతర్ధానమై పోయింది. కాని.... ఆ అమ్మాయి అలాగే అలాగే అతని కళ్ళముందు సుతారంగా నిలిచి నవ్వులను వర్షిస్తోంది.

జాజి గుండెలో ఎనలేని ధైర్యం విజృంభించింది. వెంటనే ఆ వర్షంలో తడుస్తూ పోయి ఆ అమ్మాయిముందు అతనికి నిలవాలనిపించింది. తన తలపైనుంచి, నీళ్ళు తన కనురెప్పలపైపడి బిందువులు బిందువులుగా జారి పడుతూన్నప్పుడు ఆమె తనను చూస్తే ఏమనుకుంటుంది?అనుకున్నాడు. కాని అంతలోనే తను తడిస్తే ఇంకేమైనా ఉందా అనుకున్నాడు. తన జేబులో అమృతంలాంటి భావాలు ఎన్నో కాగితాలమీద మూలుగుతున్నాయి. అసలే తన జ్ఞాపకశక్తి అంతంత మాత్రమైనది.

ఆ భావాలను వర్షంచప్పరించేస్తే నా బ్రతుకు చప్పరించబడ్డట్లే అనుకున్నాడు. అప్పుడే ఛీ....పిరికివాడా....అని వీపుమీద ఛెళ్ళున చరచినట్లు ఆకాశం ఉరిమింది. అతని ముఖాన్ని చీల్చుతూన్నట్టు మెరపు మెరిసింది. జాజి,'నేనెందుకూపనికిరాను నేనెందుకూ పనికిరాను....'అనుకుంటూ నిరుత్సాహ పడిపోయాడు. అతని గుండెల్లో ఎడతెగని బాధ మూల్గింది. అంతకంతకు రాత్రి పెరుగుతోంది. టైమెంతయిందో తెలియడం లేదు. అతని చేతికి వున్న గడియారానికి రేడియం డయలు లేదు. సెంట్రల్ జైలులో కొట్టిన గంటల్ని అతను వినే స్థితిలో లేడు!

ఎంత వేళయిందో తెలీదు. ఆ తోటంతా భయంకరంగా ఉంది. మనుష్యులమధ్య ఎంతో భయపడుతూ తిరిగే జాజి, ఆ భయంకరమైన ప్రకృతిలో మహోత్సాహంతో నిలిచి ఉన్నాడు. ఆగాలి, ఆ చల్లదనం, ఆ వర్షపు జల్లులు అతనిలో విచిత్రమైన సుఖాన్ని నింపుతున్నాయి. కాని కడుపులో ఆకలి కరకరలాడిపోతోంది. వెచ్చగా గుక్కెడు కాఫీ నీళ్ళు పడినా బాగుండు ననుకున్నాడు. ఈ రాత్రి ఇక్కడే ఇలాగే ఈ ప్రసిద్ధ పురుషుల సమాధుల మధ్య ఈ కళ్యాణ మంటపాన నిలిచి విశ్వ సౌందర్యాన్ని సందర్శించాలి అనుకున్నాడు. ఒక్కసారి అర్ధ నిమీలిత నేత్రాలతో తనలో తాను తాదాత్మ్యం చెందాడు. అతని కళ్లముందు విప్లవరేఖ వీరేశలింగం నిండుగా ప్రజ్వలించాడు. ఆయన కదలి అతని ముదుకు వచ్చినట్లయింది.!

అప్పుడే, 'ఎవరు నువ్వు....ఇక్కడేం చేస్తున్నావ్....'అన్నట్టు గుండెలు జలదరించేట్టుగా అతని ముఖంమీద బ్యాటరీలైటు కాంతి పరచుకుంది! అతను ఒక్కసారి త్రుళ్ళి పడ్డాడు. అప్పుడే పకపక వాన చినుకుల నవ్వు ఆ తోటంతా జలజల రాలింది. ఎట్ట ఎదుట ఆమె!

అతని ఆశ్చర్యానికి మేరలేదు. ' ఏమిటి! మీరా ...' ఈరాత్రి...ఈ వర్షంలో ఈ చీకటిలో...! ఆమె ధైర్యానికి అతను విస్తుపోయాడు. ఆమె కిలకిల నవ్వింది.

' ఏం.... చీకటిలోరాకూడదా... ముందు ఈ కాఫీ తాగండి. కాస్త ప్రాణం తేరుకుంటుంది. మీకు ఆకలి వేయడం లేదూ....కవిత్వం పిచ్చిలో కాబోలు.... తాతయ్య మీగురించి చెప్పాడు లెండి. వర్షం వెలిస్తేనే గాని, మీరక్కడనుంచి కదలరని .... మీ జేబుల్లో అవేవో అక్షరాల బొమ్మలుంటాయటకదూ.... ఆబొమ్మలకు వర్షాన్ని చూస్తే తగని భయమటకదూ....'ఆమె నవ్వుతోంది. వర్షం గేలిచేస్తోంది. సమస్తమూ హసిస్తోంది.

జాజికి ఏమి మాట్లాడాలో అర్థంకాకుండా ఉంది. అతని గుండెలో

విచిత్రమైన అనుభూతులు కదలిపోతున్నాయి.

'మీ తాతయ్యగారికెలా ఉందండీ.....' ఇదేమిటి..... ఇదేమిటి....అని అతనిలో అతన్నెవ్వరో వెక్కిరిస్తున్నారు.

హాయిగా నిద్రపోతున్నాడు. 'చల్లచల్లగా వర్షం నభోమండలంనుంచి రసాతలాన్ని చేరుకుంటోంది.

'అరే.... వారికి తెలియకుండా వచ్చారా'....

'తెలిస్తే ఈ వర్షంలో కదలనిస్తాడటండీ... మరింత ఆరోగ్యం చెడగొట్టుకొని, నా కోసం ఎదురుచూస్తూ కూర్చోడూ......'

'మీరు మంచిపని చేయలేదండి....' ఛీఛీ ..తను ఇట్లా మాట్లాడుతాడేమిటి....కాఫీ చొక్కామీద ఒలికింది. అతని కంఠం ,నాలుక అన్నీ అన్నీ అతన్ని దగాజేస్తున్నాయి. ఆమె త్రిప్పుతూన్న ఫ్లాస్కుమూత గిరగిరా అతన్ని తిప్పుతూ తిరిగింది.

ఆమె నవ్వలేదు. వర్షమే ఆగిపోయినట్లయింది. 'ఏమండోయ్ కవిగారూ... మీరిలా మాట్లాడటం రెండోసారి. మళ్ళీ మీరు ఇలా మూడో సారి మాట్లాడకుండా ఇక్కడనుంచి వెళ్ళిపోతున్నా. ఇదిగో మీ గొడుగు.... '

అతను నిరుత్తరుడైపోయాడు.ఇంతవర్షంలో ఎలా వెళ్తారు? ' అతనికి మతిపోయింది.

' ఏం.... మీగొడుగులో రమ్మంటారా.....' దబాయింపుగా వర్షం ముంచెత్తుతోంది.

'నేను అనలేను. కాని... వర్షంలో తడవ్వగూడదండీ...' జాలిగా కురుస్తోంది వర్షం.

'నాకు జలుబు చేయదండీ...'

'నా జేబులోని కాగితాలూ, ఈ గొడుగూ మీరు తీసుకోండి. నాకు వర్షంలో తడవడమంటే చాలా ఇష్టం . ఇవిగోండి'....పులకించిపోయింది రసాతలమంతా.

ఆమె మనసు ఉగ్రూత లూగింది. కొంటెగా జవాబీయబోయింది. కాని చల్లగాలి మబ్బువలె వర్షించింది.

'నా దగ్గర మరో గొడుగుందండీ ....' అతను స్తంభించిపోయాడు. కాని స్తిమితపడ్డాడు.

అప్పుడే , ఆమె ' మీరు నా వెనుక రాకండి.... రోడ్డు మీద నడిచేప్పుడు కార్లూ అవీ వస్తే ఆ లైట్ల కాంతి మనమీద పడుతుంది. వాళ్ళు మనకు కనబడరు

కాని, మనం వాళ్ళకు కనిపిస్తాం. అప్పుడు వారేమనుకుంటారు......?'

ఆమె అడుగులు గబగబా వేసింది. ఆమె ఎందుకనో నవ్వుకుంటూన్నట్లే ఉంది. అలాగే వర్షం కురుస్తోంది. అలాగే కురుస్తూ కురుస్తూ ఒక్కసారి ఆ వర్షం విజృంభించి 'జాజి'ఏమరుపాటుగా పట్టుకున్న ఆ గొడుగును వెనక్కి విరిచేసింది. అతన్ని పూర్తిగా తనలోకి చేర్చుకుంది. జాజి పకపక మనసులో నవ్వుకున్నాడు. అతని భావాల సంపుటాలన్నీ కరిగి నీరై రసాతలాన ఇంకిపోయాయి. గట్టిగా ఆమెను పిలవాలని జాజి మనసులోని మనసు వానకోకిలై ఎలుగెత్తింది. కాని.... కాని అతను అలాగే నిలబడిపోయాడు. జాజి పూలవానలో నిలిచినట్లు, సంతృప్తి వెన్నెలలో ఈదులాడుతున్నట్లు, ఆమె వెళ్తూన్న దిశవైపు అలాగే చూస్తూ ఉండిపోయాడు!

(ఆంధ్ర ప్రభ, 16-11-1960)